PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

శనివారం 10-10-2026 | పేజీలు : 8 | వెల రు : 2/- | సంపుటి : 2 సంచిక :130 | ప్రచురణ: సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

# నిఘా నీడలో ఢిల్లీ.

- దిల్లీలో భారీ ఆందోళనల నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత.
- 20 వేల మందికి పైగా పోలీసు, పారామిలిటరీ బలగాల మోహరింపు.
- అమిత్ షా అపాయింట్‌మెంట్లు, పర్యటనలు రద్దు.
- జంతర్‌మంతర్ వద్ద నిరసనకు అనుమతి నిరాకరణ.
- సీసీటీవీ, ఫేషియల్ రికగ్నిషన్‌తో నిఘా.
- 57 మెట్రో స్టేషన్ల మూసివేతకు పోలీసుల ప్రతిపాదన.

సీఈసీకి వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ , ప్రతిపక్ష ఇండియా కూటమి దిల్లీలో భారీ ఆందోళనలకు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో దేశ రాజధానిలో కఠిన భద్రతా చర్యలను అమలు చేస్తున్నారు. కేంద్రం 20వేలకు పైగా పోలీసులు, పారామిలిటరీ బలగాలను మోహరించింది.

## అపాయింట్‌మెంట్లు రద్దు చేసుకున్న అమిత్ షా




2లో▸

## 'నిరసనల్లో మహిళా పోలీసులపై లైంగిక వేధింపులు': కేంద్రం సంచలన ఆరోపణలు



ఎన్నికల సంఘం ప్రధాన కమిషన్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో విపక్ష ఎంపీలు కొన్నిరోజులుగా దిల్లీలో నిరసనలు చేపడుతున్నారు. ఆ నిరసనలకు ఎలాంటి అనుమతి లేదని, అవి చట్టవిరుద్ధమని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా శుక్రవారం సుప్రీంకోర్టు కు తెలిపారు. ఈ ఆందోళనల సమయంలో విధుల్లో ఉన్న మహిళా పోలీసు సిబ్బంది లైంగిక వేధింపులకు గురై.. గాయపడ్డారని ఆరోపించారు . పోలీసు సిబ్బందిని మాటలతో దూషించారని, అయినా వారు బాధ్యతాయుతంగానే వ్యవహరించారని పేర్కొన్నారు.

## తెలంగాణ ఫైర్ ఎన్‌వోసీ నిబంధనల్లో ప్రభుత్వం కీలక మార్పులు

- తెలంగాణలో ఫైర్ ఎన్‌వోసీ నిబంధనల్లో కీలక మార్పులు.
- నివాస అపార్ట్‌మెంట్ల ఎత్తు పరిమితి 18 నుంచి 24 మీటర్లకు పెంపు.
- 24 మీటర్లకు మించిన భవనాలకు ఫైర్ టవర్ తప్పనిసరి.

2లో▸

## రిజర్వేషన్ల అంశం.. రేపు క్యాబినెట్ కీలక భేటీ

- చంద్రబాబు అధ్యక్షతన శనివారం ఏపీ కేబినెట్ భేటీ.
- ఉదయం 11 గంటలకు సచివాలయంలో సమావేశం.
- స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లపై చర్చ.
- బీసీలకు 34% రిజర్వేషన్ల పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు.



2లో▸

## 'జీవో 59' దరఖాస్తుదారులకు గుడ్ న్యూస్

హైదరాబాద్: జీవో 59 (+శీ 59) దరఖాస్తుదారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 500 గజాల లోపు జీవో 59 పెండింగ్ దరఖాస్తులకు నెలలో పరిష్కారం చూపుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ మేరకు మెమో నంబర్ 48030 పేరిట కలెక్టర్లకు ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. జీవో 59 అమలులో అక్రమాలకు తావు లేదని.. నిబంధనల మేరకు నిర్ణయాలు ఉంటాయని పొంగులేటి పేర్కొన్నారు. గతంలో జీవో 59లో అక్రమాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కన్వేయన్స్ డీడ్స్ కేసులను కూడా సమగ్రంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. నివాసాలు ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు ఉద్దేశించిందే జీవో 59.
ఎర్రవల్లిలో అసైన్డ్ ల్యాండ్స్ ఉంటే పేదలకు ఇస్తాం
ఎర్రవల్లిలో సర్వే కోసం మరోసారి నోటీసులు ఇచ్చినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.



## క్షణికానందం కోసం అమూల్యమైన ప్రాణాలు పోగొట్టుకోవద్దు



హైదరాబాద్: నగరంలోని ట్యాంక్‌బండ్‌తో పాటు ప్రధాన రహదారులు, చెరువులు, పార్కుల వద్ద అర్ధరాత్రి వేళల్లో పుట్టినరోజు వేడుకలు, కేక్ కటింగ్‌లు వద్దని ప్రజలకు హైదరాబాద్ సీపీ సజ్జనర్ విజ్ఞప్తి చేశారు. సంతోషంగా నిర్వహించుకోవాల్సిన వేడుకలు కుటుంబాలకు తీరని నష్టాన్ని మిగులుస్తున్నాయన్నారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు.

2లో▸

### జగన్‌కు వచ్చే క్రిమినల్ ఆలోచనలు ఎవరికీ రావు: రామ్మోహన్ నాయుడు



స్థానిక ఎన్నికలు జరగకుండా అడ్డుకోవాలన్నదే వైకాపా కుట్ర అని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆక్షేపించారు.

2లో▸

## # ఎల్‌నినో అతి తీవ్రం కాబోతోందా?



- డిసెంబరులో ఎల్‌నినో గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం.
- వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగవచ్చని డబ్ల్యూఎంవో అంచనా.
- పసిఫిక్ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు 3.7డిగ్రీల పెరిగే అవకాశం.
- 1950 తర్వాత అత్యంత బలమైన ఎల్‌నినోగా మారే సూచనలు.
- ప్రపంచవ్యాప్తంగా తీవ్ర వేడి, కరవు ముప్పు.
- ఎల్‌నినో ప్రభావంతో భారత్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు.
- పర్యావరణం, ప్రజలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం.

2లో▸

జాతీయ తెలుగు దినపత్రిక
సందేశం టైమ్స్
10-10-2026

# సంపాదకీయం

## ఓపీ'ఎస్' అంటే ఆర్థిక అత్యయిక పరిస్థితే!

పెండింగ్ బకాయిలను చెల్లించాలని, వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో ఉపాధ్యాయులు, ఇతర ప్రభుత్వోద్యోగులు, పెన్షనర్లు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా, తెలంగాణలో పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని కోరుతున్నారు. సమాజంలో మిగిలిన శ్రామికుల్లాగే ప్రభుత్వోద్యోగులకు కూడా హక్కులున్నాయి. కాబట్టి శాంతియుతంగా, పరిపాలనకు ఆటంకం లేకుండా, ప్రజలకు ఇబ్బంది లేకుండా వారు తమ డిమాండ్ల కోసం ఆందోళనలు చేపట్టవచ్చు. కానీ ప్రస్తుత నేపథ్యం అసాధారణమైనది. నేను వాస్తవాల ఆధారంగా చెబుతున్నాను. పరిష్కారాలతో వినమ్రంగా అర్థిస్తున్నాను. తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు, ప్రభుత్వోద్యోగులు, ప్రజలు వీటిని నిశితంగా పరిశీలించి విజ్ఞతతో నిర్ణయాలు తీసుకోవలసిందిగా కోరుతున్నాను.

పరిపాలన ఉన్నది-- ప్రభుత్వంలోని అధికారులు, ఉద్యోగులు, నేతల కోసం కాదు. పన్నులు కట్టే సామాన్య ప్రజల కోసం. రెక్కాడితేగానీ డొక్కాడని నిరుపేదలు తినే లేదా ఉపయోగించే ప్రతి వస్తువు మీదా కట్టే పన్నులు సైతం ఖజానాకు వెళ్తున్నాయి. ఈ డబ్బుతో పాటు ఆ ప్రజల పిల్లల భవిష్యత్తును తాకట్టుపెట్టి నేటి అవసరాల కోసం ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయి. రేపటి రోజున వారి పిల్లలే ఈ అప్పులను పన్నుల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. రెండోది-- ప్రభుత్వోద్యోగులు జీతభత్యాలు కోరటంలో తప్పులేదు. మరి అంతే గట్టిగా ప్రజలకు సేవలూ అందించాలిగా? ఈ దేశంలో ఏ రంగంలో చూసినా కొరతలే. హైదరాబాద్‌నే తీసుకుంటే... మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదల, వర్షం వస్తే వరదనీరు ముంచెత్తకుండా ఏర్పాట్లు, ట్రాఫిక్, చట్టబద్ధపాలన దగ్గర్నుంచి స్కూళ్లలో మన పిల్లలకు అందించే విద్య వరకు ఖర్చు కనిపిస్తోంది గానీ, ఫలితాలనివ్వటం లేదు. ఆ ఫలితాలను ఇవ్వాల్సింది ప్రభుత్వం, ప్రభుత్వోద్యోగులే కదా!

ఇదేదో ముఖ్యమంత్రి, ఉద్యోగుల మధ్య సమస్య అనుకుంటున్నారు గానీ.. సమాజం సమస్య అని గుర్తించటం లేదు. అందుకే పాఠశాల విద్య ఇంత దిగజారినా, విద్యాప్రమాణాలు అధ్వానంగా ఉన్నా సరైన చర్చ చేయటం లేదు. సామాన్య ప్రజలు, పన్నులు కట్టే మిగిలినవారు ఏం పాపం చేశారు? వాళ్ల పిల్లలకు ఎందుకు చదువు అందటం లేదు? ప్రభుత్వంలో ఉన్నవారు, సంపన్నులు తమ పిల్లలకు ఇంట్లో ట్యూషన్లు పెట్టిస్తున్నారు. కొందరు తల్లిదండ్రులు చదువుకున్నారు కాబట్టి స్వయంగా బోధిస్తున్నారు. కానీ కొద్దిమంది తంటాలు పడితే సరిపోతుందా? సామాన్య ప్రజల పిల్లలకు విద్య అక్కర్లేదా? మరి ఆ బాధ్యతను ప్రభుత్వం ఎందుకు నెరవేర్చటం లేదు? ప్రజలు గొంతెత్తటం లేదు కాబట్టా? ఎన్నికల్లో డబ్బులిస్తేనో, తాయిలాలిస్తేనో సరిపోతుంది కాబట్టా? కులం, మతం రెచ్చగొడితే సరిపోతుంది కాబట్టా?.. ప్రజల హక్కుల్ని కాపాడే బాధ్యతను పట్టించుకోకుండా, ఉద్యోగులు తమ హక్కుల్ని మాత్రం కాపాడాలి అంటే-- ప్రజాస్వామ్యం ఎంతోకాలం నిలవదు.

జేపీకి ప్రభుత్వోద్యోగులంటే కోపం అని చాలామంది అనుకుంటారు. నేనూ ప్రభుత్వంలో పనిచేశాను. నిజాన్ని నిజాయితీగా, నిష్పాక్షికంగా చెప్పటం అంటే అది ఒకరికి వ్యతిరేకం కాదు. ఈ దేశం పట్ల ప్రేమ. రాబోయే తరం భవిష్యత్తు పట్ల బోలెడంత ఆసక్తి, ఆందోళన. రిటైరైన ప్రభుత్వోద్యోగులకు పదవీ విరమణ బెనిఫిట్స్ వేలాది కోట్లు ప్రభుత్వం ఇవ్వలేకపోవడాన్ని ఇప్పటికే మనం చూస్తున్నాం. అలవిమాలిన కోర్కెలు మనం కోరితే ఇక పరిస్థితి ఏమిటి? రేపొద్దున ఏం జరిగినా, దేశం అల్లకల్లోలమైనా 'మా జీతభత్యాలకు, పెన్షన్లకు ఏం ఢోకా ఉండదని ప్రభుత్వోద్యోగులు అనుకుంటుండవచ్చు. అలాంటిదేమీ ఉండదు. ఇప్పటికే చెల్లించలేకపోతున్నారు. పరిస్థితి మరీ చేయి దాటిపోతే, ఆర్థిక వ్యవస్థ నడుము విరిగిపోతే, కూలబడిపోతే ఎవరికీ ఏ జీతాలూ రావు. మీకు తెలుసో లేదో రాజ్యాంగంలోనే ఆ ఏర్పాటు ఉంది. ఆర్థిక అత్యవసర పరిస్థితిని (ఫైనాన్షియల్ ఎమర్జెన్సీ) ప్రకటించేదాకా వస్తే, ఎవరూ ఏమీ చేయలేరు. ఆ పరిస్థితి తీసుకురావద్దు.

మరో అంశం-- దేశం మొత్తంలో ప్రభుత్వోద్యోగులకు అత్యధిక జీతభత్యాలున్నది తెలంగాణ రాష్ట్రంలో. మామూలుగా కేంద్ర ప్రభుత్వోద్యోగులకు ఎక్కువ జీతాలుంటాయి. జాతీయస్థాయిలో విధులు పరిమితం, తక్కువ సంఖ్యలో ఉద్యోగులుంటారు కాబట్టి. పనులు జరిగేది రాష్ట్రాల్లో కాబట్టి, నూటికి 90 మంది రాష్ట్ర ప్రభుత్వ కొలువుల్లో ఉంటారు. కానీ కేంద్ర ప్రభుత్వంలో కంటే తెలంగాణలో ఉద్యోగుల జీతభత్యాలు 25--30శాతం ఎక్కువ. తెలంగాణ నమూనాను అనుకరించింది కాబట్టి.. ఆ తర్వాత ఏపీలో. 2014లో రాష్ట్ర విభజన జరిగినప్పుడు దేశంలోనే అత్యంత మిగులు ఉన్న రాష్ట్రం తెలంగాణ. ఈ విషయాన్ని పద్నాలుగవ ఆర్థిక సంఘం వివరాలతో సహా ప్రకటించింది. ఇవాళ తెలంగాణలో హైదరాబాద్‌లాంటి తరగని గని ఉన్నా కూడా, ఇంతమంది ఇంత కష్టపడుతున్నా, పన్నులు కడుతున్నా కూడా నెలనెలా ఖర్చుల కోసం వెతుక్కోవాల్సి వస్తోంది. కాబట్టి మనం ఉద్యోగుల అవసరాలను పెరుగుతున్న ధరలకు అనుగుణంగా తీర్చాలి. కానీ గొంతెమ్మ కోర్కెలు కోరితే.. రేపొద్దున డబ్బులు కట్టాల్సింది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాదు, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ కాదు, వారి పిల్లలు కాదు... ఈ రాష్ట్రంలోని బిడ్డలు, వచ్చేతరం యువతే.

దేశం మొత్తంలో పనిచేసే వారిలో కేవలం 3శాతం ఉన్న ప్రభుత్వోద్యోగులకు మాత్రమే వర్తించే పాత పెన్షన్ విధానం ఎంత ప్రమాదకరమో అవగాహన పెంచేందుకు గతంలోనే లోక్‌సత్తా ప్రయత్నం చేసింది. ఓపీఎస్ గురించి కొన్ని విషయాలు స్పష్టంగా అర్థం కావాలి. ప్రపంచంలో ఎన్నదగిన అన్ని దేశాల్లో.. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ-- ఎక్కడైనా ప్రభుత్వం ఎక్కువ, ప్రైవేటు తక్కువ అనుకోవటం ఉండదు. ఉద్యోగం చేసేటప్పుడే అందరూ జీతం నుంచి కొంత డబ్బు వెనకేస్తారు. ప్రభుత్వం లేదా ప్రైవేటు యాజమాన్యం అంతే మొత్తం డబ్బు జమ చేస్తుంది. ఉదాహరణకు, అమెరికాలో ఉద్యోగి నెల జీతం నుంచి 6.2శాతం వెనకేస్తాడు. అంతే డబ్బును యాజమాన్యం లేదా ప్రభుత్వం ఆ ఖాతాలో వేస్తుంది. ప్రైవేటులో అయితే ఆ సంస్థ యజమాని తమ వాటాగా అందులో జమ చేస్తారు. ఈ డబ్బు మొత్తాన్నీ వేరే ఖాతాలో పెడతారు. ఇలా ఉద్యోగి సర్వీసులో ఉన్నంతకాలం ఏ నెలకానెల జమ చేస్తుంటారు. ఆ డబ్బు నుంచే వారికి పెన్షన్ చెల్లిస్తారు. దీనివల్ల వచ్చే తరం మీద ఒత్తిడి ఉండదు. ఏపీలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రభుత్వోద్యోగుల జీతభత్యాలు, పెన్షన్లపై సమగ్ర అధ్యయనం చేశారు. అప్పట్లో, అంటే 3--4 ఏళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం రూ.1 లక్షా 42 వేలు. కానీ ప్రభుత్వోద్యోగుల సగటు ఓపీఎస్ పెన్షన్ ఏడాదికి రూ.5 లక్షల 34 వేలు. ఇప్పుడు తలసరి ఆదాయం పెరిగినా, ఆ నిష్పత్తిలో తేడా ఉండదు. ఇందులోని అసమతుల్యతను, అన్యాయాన్ని అర్థం చేసుకోవటానికి పెద్ద తెలివితేటలు అక్కర్లేదు. తలసరి ఆదాయానికి నాలుగు రెట్లు సగటు పెన్షన్, అదీ పనిచేసేవారిలో 3శాతం మాత్రమే ఉన్న ప్రభుత్వోద్యోగులకు మాత్రమే. అమెరికా ప్రభుత్వం పెట్టే ఖర్చులో 14--15శాతం పెన్షన్లకు పోతుంది. కానీ ప్రభుత్వ, ప్రైవేటు, తయారీ, సాఫ్ట్‌వేర్ తేడా లేకుండా సమాజంలో పనిచేసే దాదాపు 94శాతం మందికి అందుతుంది. మన దేశంలో 3శాతం ఉన్న ప్రభుత్వోద్యోగులకోసం, అది కూడా ఖజానాలో డబ్బు పెట్టకుండా, ఏటా ప్రభుత్వ ఖర్చులో 18శాతం నేరుగా పెన్షన్ కోసం వ్యయం చేస్తున్నాం.

ఒక రాష్ట్రం అప్పుల భారం సొంత ఆదాయంలో 20శాతం దాటకూడదు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో 50శాతం దాటిపోయింది. ఓపీఎస్ కొనసాగిస్తే ఇది క్రమంగా 200శాతానికి వెళ్తుంది. భవిష్యత్తును కాపాడే ఉద్దేశంతోనే వాజపేయి ప్రభుత్వం చివరి దశలో అందరినీ ఒప్పించి 2004 నుంచి కొత్త పెన్షన్ విధానం ఎన్‌పీఎస్ తీసుకొచ్చింది. తెలంగాణలో ఓపీఎస్ గణాంకాలపై సమగ్ర అధ్యయనం జరగలేదు. తెలంగాణ ప్రభుత్వానికి బహిరంగంగా నేను విజ్ఞప్తి చేస్తున్నాను. పాత పెన్షన్ పద్ధతిని మళ్లీ తెచ్చినట్లయితే ఏం జరుగుతుందో-- గతంలో ఏపీ చేసినట్లుగా నిపుణుల కమిటీ లేదా ప్రామాణిక సంస్థలతో అధ్యయనం చేయించండి. ఆ శ్వేతపత్రాన్ని బయటపెట్టండి.నేను చెప్పినవన్నీ వాస్తవాలు. ఒక్కటైనా అబద్ధమేమో పరిశీలించండి. ప్రభుత్వోద్యోగులకు కొన్ని న్యాయమైన ప్రశ్నలున్నాయి. ఉదాహరణకు, ఎన్‌పీఎస్/సీపీఎస్‌లో మేం పెట్టిన డబ్బు తదనంతరం ఏమవుతుంది? అని. ఆ డబ్బు ఎక్కడికీ పోదు, ఉద్యోగి చనిపోతే కుటుంబ సభ్యులకు వెళ్తుంది. ఆర్థిక వ్యవస్థ దెబ్బతిని ఫండ్‌లో, స్టాక్ మార్కెట్‌లో డబ్బు తిరిగి రాకపోతే?... ఈ భయాలకు సమాధానంగానే ప్రభుత్వం ఇంకో పద్ధతిని తీసుకొచ్చింది.

## జగన్‌కు వచ్చే క్రిమినల్ ఆలోచనలు

# ఎవరికీ రావు:

మొదటిపేజీ తరువాయి

శ్రీకాకుళం: స్థానిక ఎన్నికలు జరగకుండా అడ్డుకోవాలన్నదే వైకాపా కుట్ర అని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆక్షేపించారు. 24 శాతం ఉన్న రిజర్వేషన్లను 34 శాతానికి పెంచుతూ ఇచ్చిన జీవోను హైకోర్టు కొట్టేసిన తర్వాతే.. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లినట్లు చెప్పారు. బీసీలకు సామాజిక న్యాయం జరగాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. శ్రీకాకుళంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడుతో కలిసి ఆయన మాట్లాడారు. ఎన్నికలు నిర్వహించి, కేంద్ర ప్రభుత్వ నిధులను తీసుకొచ్చి గ్రామాలను అభివృద్ధి చేయాలన్నదే చంద్రబాబు సంకల్పమని, దానికి జగన్ మోహన్‌రెడ్డి అడ్డుపడుతున్నారని అన్నారు. జగన్‌కు వచ్చే క్రిమినల్ ఆలోచనలు ఎవరికీ రావని మండిపడ్డారు. బీసీలను సొంత బిడ్డల్లా చూసుకునే పార్టీ తెదేపా అని తెలిపారు.

### బలహీనవర్గాలపై వైకాపా కక్ష: అచ్చెన్నాయుడు

బలహీనవర్గాలపై వైకాపా కక్ష కట్టిందని ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. 1985లో ఎన్టీఆర్ తొలిసారి బీసీలకు 20శాతం రిజర్వేషన్లు ఇచ్చారని గుర్తు చేశారు. ఆ తర్వాత ఆ రిజర్వేషన్లను 34శాతానికి పెంచిన ఘనత చంద్రబాబుదేనని చెప్పారు. గతంలో వైఎస్ఆర్, కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా 34 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలు జరిపారన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాకే 24శాతంతో స్థానిక ఎన్నికలకు వెళ్లారని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లను ఎందుకు తగ్గించారో వైకాపా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "పాత చట్టాన్ని రద్దు చేయకుండానే మీరు రిజర్వేషన్లు ఎందుకు తగ్గించారు. సుప్రీం కోర్టు కొట్టేస్తుందని తెలిసే రిజర్వేషన్లు పెంచామని దుష్ప్రచారం చేస్తున్నారు. హైకోర్టు తీర్పుపై మీరు సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లలేదు?" అని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు.

## క్షణికానందం కోసం అమూల్యమైన ప్రాణాలు పోగొట్టుకోవద్దు

మొదటిపేజీ తరువాయి

ఇటీవల అర్ధరాత్రి సమయంలో ట్యాంక్‌బండ్‌పై జరిగిన రోడ్డు ప్రమాదాన్ని ఆయన గుర్తుచేశారు. ఆరేళ్ల చిన్నారి పుట్టినరోజు వేడుకకు కుటుంబసభ్యులంతా కలిసి ట్యాంక్‌బండ్‌కు వెళ్లారని.. అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నారితో పాటు మరో వ్యక్తి మృతి చెందారన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా పటిష్ఠ ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. "పుట్టినరోజు కుటుంబానికి సంబంధించిన వ్యక్తిగత వేడుక. దానిని ఇళ్ల వద్ద, ఏదైనా సురక్షితమైన ప్రదేశాల్లో మాత్రమే జరుపుకోవాలి. అర్ధరాత్రి వేళల్లో రోడ్లపై జనసంచారం తక్కువగా ఉండటంతో వాహనాలు మితిమీరిన వేగంతో దూసుకొస్తుంటాయి. అలాంటి సమయంలో చిన్నపిల్లలను తీసుకుని నడిరోడ్డు పైకి రావడం ఏమాత్రం సరికాదు. ట్యాంక్‌బండ్‌పై ఇలాంటి వేడుకలు నిర్వహించడం నిబంధనల ప్రకారం పూర్తిగా నిషేధం. గతంలోనే దీనిపై జీహెచ్‌ఎంసీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అక్కడికి వచ్చేవారిని పోలీసులు వెనక్కి పంపిస్తున్నప్పటికీ.. అర్ధరాత్రి మళ్లీ వచ్చి వేడుకలు చేసుకోవడంతో ఇలాంటి దుర్ఘటనలు జరుగుతున్నాయి. క్షణికానందం కోసం చేసే పొరపాట్లతో అమూల్యమైన ప్రాణాలను పోగొట్టుకోవద్దు. ఇకపై ఎవరూ అర్ధరాత్రి ట్యాంక్‌బండ్, చెరువులు, బహిరంగ ప్రదేశాల వద్దకు వచ్చి సంబరాలు చేసుకోద్దు. నగర పోలీసులకు సహకరిస్తూ ప్రాణాలను కాపాడుకోవాలి" అని సజ్జనర్ కోరారు.

## తెలంగాణ ఫైర్ ఎన్‌వోసీ నిబంధనల్లో ప్రభుత్వం కీలక మార్పులు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణ ఫైర్ ఎన్‌వోసీ నిబంధనల్లో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. నివాస అపార్ట్‌మెంట్ల ఎత్తు పరిమితిని 18 నుంచి 24 మీటర్లకు పెంచింది. 24 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తున్న భవనాలకు ఫైర్ టవర్ తప్పనిసరి చేసింది. బేస్‌మెంట్‌లో డీజీ రూముల వెంటిలేషన్‌కు కొత్త వెసులుబాటు కల్పించింది. క్రెడాయ్, నరెడ్కో, బిల్డర్స్ ఫెడరేషన్ ప్రతినిధులతో చర్చల అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకుంది. ఈ మేరకు తెలంగాణ అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్‌సింగ్ మాన్ ఉత్తర్వులు జారీ చేశారు. 2026 అక్టోబర్ 7 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చినట్లు పేర్కొన్నారు. ఫైర్ ఎన్‌వోసీ సరళీకరణ, భవనాల్లో అగ్ని భద్రతా చర్యల అమలే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

## ముగిసిన తెలంగాణ ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్




హైదరాబాద్: తెలంగాణ ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్ ముగిసింది. సాయంత్రం 5 గంటల వరకు 97శాతం పోలింగ్ నమోదైంది. రాష్ట్ర వ్యాప్తంగా 115 పోలింగ్ స్టేషన్లలో ఓటింగ్ నిర్వహించారు. మొత్తం 34,889 ఓట్లలో 33,973 ఓట్లు పోలయ్యాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో 98శాతం, కరీంనగర్‌లో 97శాతం పోలింగ్ నమోదైంది. ఏ యూనియన్ విజయం సాధిస్తుందో అర్ధరాత్రికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఎన్నికల్లో గెలుపుపై ఈ నెల 17న అధికారిక ప్రకటన వెలువడనుంది.

## సంగారెడ్డి జిల్లాలో విషాదం.. నీటికుంటలో పడి ముగ్గురి మృతి

మనూరు: సంగారెడ్డి జిల్లా మనూరులో విషాదం చోటుచేసుకుంది. బట్టలు ఉతకడానికి వెళ్లి, నీటికుంటలో పడి ముగ్గురు మృతి చెందారు. వారిలో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. అన్నదమ్ములు నర్సింహారెడ్డి, సంగమేశ్వర్‌రెడ్డి మృతదేహాలను స్థానికుల సాయంతో పోలీసులు బయటకు తీశారు. నర్సింహారెడ్డి భార్య కృష్ణవేణి పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## నిఘా నీడలో ఢిల్లీ.. అపాయింట్‌మెంట్లు రద్దు చేసుకున్న అమిత్ షా

మొదటిపేజీ తరువాయి

మరోవైపు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్ని అపాయింట్‌మెంట్లు, అధికారిక పర్యటనలు రద్దు చేసుకున్నారు. ఢిల్లీ సహా పొరుగు రాష్ట్రాల్లోని పరిస్థితులపై రెండ్రోజులుగా ఆయన అత్యున్నతస్థాయి సమీక్షలు నిర్వహిస్తున్నారు. ముఖ్యమైన ప్రదేశాల్లో భద్రతా చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

పెద్ద ఎత్తున ఆందోళనకారులు జంతర్‌మంతర్ వద్దకు చేరుకునే అవకాశం ఉండడంతో ఢిల్లీ సరిహద్దుల్లో వాహనాల తనిఖీలను పెంచారు. జంతర్‌మంతర్ వద్ద సీజేపీ నిరసనకు పోలీసులు అనుమతి నిరాకరించారు. నిరసనకారులను నిరంతరం పర్యవేక్షించడానికి సీసీటీవీ నిఘా , ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ కెమెరాలు ఏర్పాటు చేశారు. రైల్వే, బస్ స్టేషన్ల వద్ద భద్రత పెంచారు. నిరసనకారులుగా నటిస్తూ.. నేరస్థులు ఆందోళనల్లో పాల్గొనకుండా అడ్డుకునేందుకు భద్రతా సంస్థలు చర్యలు చేపట్టాయి. సోషల్ మీడియా పోస్టులపైనా ప్రత్యేక నిఘా పెట్టాయి.

### అక్రమాలను అడ్డుకోవడం నా తప్పా?

నేటి నుంచి మూడు రోజుల పాటు భారీ నిరసనలు చోటుచేసుకునే అవకాశం ఉండడంతో.. ఢిల్లీలోని 57 మెట్రో స్టేషన్లను రెండు రోజుల పాటు మూసివేయాలని మెట్రో రైల్ కార్పొరేషన్‌ను పోలీసులు కోరారు. శనివారం న్యూఢిల్లీ- హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్ల మధ్య కొన్ని గంటల పాటు రైలు సర్వీసులను రద్దు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ (+ఝఅవంష్ట్ర ఖబఝతీ) నివాసం, ఈసీ కార్యాలయం వద్ద జడ్ం భద్రతతో పాటు అదనపు సిబ్బందిని మోహరించారు. మరోవైపు ఢిల్లీకి వస్తోన్న తమ కార్యకర్తలను పోలీసులు నాగ్‌పుర్, భోపాల్ రైల్వే స్టేషన్‌లలో అడ్డుకుంటున్నారని సీజేపీ ఆరోపించింది.

## ఎల్‌నినో అతి తీవ్రం కాబోతోందా?

మొదటిపేజీ తరువాయి

ఢిల్లీ: ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న ఎల్‌నినో వేగంగా బలపడుతోంది. దీనివల్ల చాలా ప్రాంతాల్లో సాధారణం కన్నా అధిక ఉష్ణోగ్రతలు నమోదుకానున్నాయి. ఈ మేరకు ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) గురువారం తెలిపింది. డిసెంబరులో ఎల్‌నినో గరిష్ఠ స్థాయికి చేరుకోనుందని తెలిపింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకూ ఈ వాతావరణ పోకడ కొనసాగడానికి 100 శాతం అవకాశాలు ఉన్నాయని వివరించింది. దీంతో 1950 తర్వాత అత్యంత బలమైన ఎల్‌నినోగా ఇది నిలిచిపోయే అవకాశం ఉందని వివరించింది. మానవ చర్యలతో కలుగుతున్న వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఇది తీవ్రం చేస్తుందని తెలిపింది. అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య కాలంలో.. ఎల్‌నినోకు కేంద్ర బిందువుగా ఉన్న మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో.. సాధారణం కన్నా 3.7 డిగ్రీల సెల్సియస్ మేర పెరగొచ్చని పేర్కొంది. తాజా పరిణామాలపై ప్రపంచవ్యాప్తంగా వాతావరణ నిపుణులు కూడా ఆందోళన వ్యక్తంచేశారు. నానాటికీ తీవ్రమవుతున్న ఎల్‌నినో వల్ల పసిఫిక్ మహా సముద్రంలో నిక్షిప్తమైన ఉష్ణం బయటకు విడుదలవుతుందని పేర్కొన్నారు. దీనివల్ల పుడమిలో చాలా భాగం తీవ్ర ఉష్ణోగ్రతలతో అల్లాడుతుందని పేర్కొన్నారు. "భూమి దాదాపు 'ఎర్రగా' మారింది. శీతాకాలంలో గరిష్ఠ శక్తిని సంతరించుకునే దిశగా ఎల్‌నినో సాగుతోంది" అని వాతావరణ శాస్త్రవేత్త ర్యాన్ మవీ పేర్కొన్నారు. ఈ వాతావరణ పోకడ కొత్త ప్రాంతాలకూ విస్తరిస్తోందని జెకీ హాస్‌ఫాదర్ అనే శాస్త్రవేత్త వివరించారు. పసిఫిక్‌లోని నినో 3.4 అనే ప్రాంతంలో ఉష్ణోగ్రతల్లో వైరుధ్యాలు సాధారణం కన్నా 3.4 డిగ్రీల సెల్సియస్ మేర ఉన్నాయని వివరించారు. గతంలో నమోదైన ఏ ఎల్‌నినోలోనూ ఇలాంటి పరిస్థితి లేదని చెప్పారు. మరోవైపు ఇది 'సూపర్ డూపర్ ఎల్‌నినో'గా మారనుందని వాతావరణ నిపుణుడు లియోన్ సైమన్స్ పేర్కొన్నారు. ఎల్‌నినో వల్ల జూన్-సెప్టెంబరు మధ్య భారత్‌లో దీర్ఘకాల సరాసరి వర్షపాతంతో పోలిస్తే 87.4 శాతం మేర మాత్రమే వానలు పడ్డాయి. ఈ వాతావరణ పోకడ బలపడుతున్న నేపథ్యంలో దేశ ప్రజలు, పర్యావరణంపై ప్రభావం పడుతుంది. కరవు, అసాధారణ వేడి పరిస్థితులకు ఆస్కారం పెరుగుతుంది.

# 'జీవో 59'

## దరఖాస్తుదారులకు గుడ్ న్యూస్

మొదటిపేజీ తరువాయి

అక్కడ అసైన్డ్ ల్యాండ్ ఉంటే పేదలకు పంచుతామన్నారు. భూసర్వే పురోగతిపై సచివాలయంలో అధికారులతో పొంగులేటి సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఎన్నికల్లో హామీ మేరకు అమరవీరులను గుర్తించి న్యాయం చేస్తామన్నారు. రీసర్వే పేరుతో ప్రజల నుంచి వసూళ్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏడాదిన్నరలో సమగ్ర భూ సర్వే పూర్తి చేస్తామన్నారు. 7 జోన్లలో సర్వే పర్యవేక్షణకు 14 మంది అధికారులను నియమించినట్లు తెలిపారు. భూ వివాదాలు లేని తెలంగాణను నిర్మించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

## రిజర్వేషన్ల అంశం.. రేపు క్యాబినెట్ కీలక భేటీ

మొదటిపేజీ తరువాయి

అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన శనివారం రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. ఉదయం 11 గంటలకు సచివాలయంలో క్యాబినెట్ భేటీ జరగనుంది. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లపై మంత్రివర్గం నిర్ణయం తీసుకోనుంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అంశంపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ వ్యవహారంలో రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టుకు తీర్పునకు అనుగుణంగా.. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? మొత్తం రిజర్వేషన్లు 50శాతానికి మించకుండా అన్ని వర్గాల వారికి ఎలా న్యాయం చేయాలనే అంశాలపై క్యాబినెట్‌లో చర్చించే అవకాశం ఉంది.

## దసరా సెలవులు.. బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ



హైదరాబాద్: తెలంగాణలో పాఠశాలలకు రేపటి నుంచి (శనివారం) దసరా సెలవులు కావడంతో హైదరాబాద్‌లోని వివిధ బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఎంజీబీఎస్, జేబీఎస్ బస్టాండ్లకు ప్రయాణికులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. సొంతూళ్లకు భారీగా తరలివెళ్తున్నారు. వరుస సెలవుల నేపథ్యంలో ఇవాళ్టి నుంచి ఈ నెల 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ 7000 ప్రత్యేక బస్సులను నడిపేందుకు సిద్ధమైంది. ఎప్పటిలాగే మహాలక్ష్మి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించనున్నారు. మరోవైపు ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు ప్రయాణికుల తిరుగు ప్రయాణానికి ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందీ తలెత్తకుండా అవసరమైన బస్సు సర్వీసులను ఏర్పాటు చేసేందుకు సమాయత్తమైంది.

# వృద్ధుల గౌరవం, ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి





- వృద్ధుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

వృద్ధుల గౌరవం, ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, వారి సంక్షేమం కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వృద్ధుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణ, సామాజిక భద్రత, హక్కుల పరిరక్షణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవభావంతో వ్యవహరించాలని, వారి అనుభవాలను సమాజ అభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులు వృద్ధులకు ప్రేమాభిమానాలతో పాటు తగిన ఆదరణ అందించాలని పేర్కొన్నారు. వృద్ధాప్యంలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, ఒంటరితనం, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబపరమైన సమస్యలను గుర్తించి అవసరమైన సహాయ సహకారాలు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. వృద్ధులకు మెరుగైన వైద్య సేవలు, సామాజిక భద్రతా పథకాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి రుబీనా బేగం మాట్లాడుతూ వృద్ధుల హక్కుల పరిరక్షణకు, వారు గౌరవప్రదమైన జీవితం గడిపేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వృద్ధుల పట్ల నిర్లక్ష్యం, వివక్ష చూపకుండా కుటుంబాల్లో వారికి సముచిత స్థానం కల్పించాలని పేర్కొన్నారు. వృద్ధుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణ, హక్కుల రక్షణకు అధికారులు, కుటుంబ సభ్యులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# గ్రామపంచాయతీ కార్మికులకు దసరా కానుకగా దుస్తులు, పారిశుద్ధ్య కిట్ల పంపిణీ



వట్టిపల్లి, అక్టోబర్ 10

సంగారెడ్డి జిల్లా వట్టిపల్లి మండలం బిజిలిపూర్ గ్రామ సర్పంచ్ చక్రాల నాగమణి నర్సింలు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులకు దసరా పండుగ కానుకగా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ శోభ మచందర్, మాజీ ఎంపీటీసీ సదానందం గ్రామపంచాయతీ కార్మికులకు శానిటైజర్లు, సర్ఫ్, సబ్బులతో కూడిన పారిశుద్ధ్య కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో గ్రామపంచాయతీ కార్మికుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణకు నిరంతరం కృషి చేస్తూ, పరిసరాలను శుభ్రంగా ఉంచడం ద్వారా అంటువ్యాధులు ప్రబలకుండా కార్మికులు తమ సేవలను అందిస్తున్నారని కొనియాడారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం కష్టపడుతున్న కార్మికులను గుర్తించి, దసరా పండుగ సందర్భంగా దుస్తులు, పారిశుద్ధ్య సామగ్రిని అందించడం సంతోషంగా ఉందన్నారు. గ్రామ అభివృద్ధికి, పారిశుద్ధ్య నిర్వహణకు కార్మికులు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి





- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

మెదక్ జిల్లాలో భూ భారతి కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మెదక్ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సర్వేయర్లతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ఆర్డీవోలు, తహసీల్దార్ల లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిశీలించి, అవసరమైన చోట క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పరిష్కరించాలని సూచించారు. ఎలాంటి జాప్యం లేకుండా అర్హులైన దరఖాస్తుదారులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా స్థాయి ప్రజావాణి, రాష్ట్ర స్థాయి ప్రజావాణి ద్వారా అందిన దరఖాస్తులతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిషన్ల నుంచి వచ్చిన ఫిర్యాదులు ఏ స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయో సమీక్షించి, వాటన్నింటినీ త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పేర్కొన్నారు. ప్రజల భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, దరఖాస్తుల పరిష్కారంలో జవాబుదారీతనంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి అంబాదాస్ రాజేశ్వర్, ఏడీ ల్యాండ్ సర్వే కిషన్, మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్లు, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ ఆవరణాన్ని చదును చేసిన గ్రామపంచాయతీ పాలకవర్గానికి సన్మానం



చౌటకూర్, అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి డి రమేష్ ):

సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల కేంద్రంలోని శ్రీ అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయ ఆవరణంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మొరం పోసి చదును చేయడంతో గ్రామ సర్పంచ్ పార్కల రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సందీప్ గౌడ్‌తో పాటు పాలకవర్గ సభ్యులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఆలయ ఆవరణాన్ని అభివృద్ధి చేసి భక్తులకు అనుకూలంగా తీర్చిదిద్దేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గం చేసిన కృషిని ఈ సందర్భంగా గ్రామ పెద్దలు అభినందించారు. గ్రామ అభివృద్ధితో పాటు ఆలయ పరిసరాల మెరుగుదలకు సహకరించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు లక్ష్మారెడ్డి, మల్లికార్జున్ గౌడ్, ఆలయ పూజారి రామకృష్ణ పంతులు, మాజీ ఉపసర్పంచ్ రామ గౌడ్, ఉపసర్పంచ్ దమ్మీ నాగరాణి కృష్ణ, వార్డు సభ్యులు జైపాల్ రెడ్డి, బాలరాజు, చక్రపాణి, కొజ్జా లక్ష్మయ్య, అభిలాష్, మల్లికార్జున్, గండ్ల శ్రీనివాస్, రాధాగౌడ్, ఎం. చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ వేదికపై నేరడిగుంట ప్రస్తావన.. యువ సర్పంచ్ సాయికిరణ్ కృషికి ఐఏఎస్ అధికారి ప్రశంసలు

- దేశవ్యాప్తంగా ఎంపికైన 17 మంది సర్పంచ్‌లలో తెలంగాణ నుంచి నేరడిగుంటకు ప్రాతినిధ్యం

ఆందోల్, అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ౧

జాతీయ స్థాయిలో నిర్వహించిన సర్పంచ్ సంవాద్ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం నేరడిగుంట గ్రామానికి గుర్తింపు లభించింది. దేశవ్యాప్తంగా ఎంపికైన 17 మంది సర్పంచ్‌లలో తెలంగాణ నుంచి నేరడిగుంట గ్రామ సర్పంచ్ వొగ్గు సాయికిరణ్ యాదవ్‌కు అవకాశం దక్కడం విశేషం. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ పరిధిలోని తాగునీరు, పారిశుద్ధ్య విభాగం (డీడీడబ్ల్యూఎస్) నిర్వహించిన ఈ జాతీయ స్థాయి కార్యక్రమంలో ఆయన గ్రామ అభివృద్ధి ఆలోచనలు, పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం, సమిష్టి కృషి ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ మిషన్ జాయింట్ సెక్రటరీ,



మిషన్ డైరెక్టర్ ఐఏఎస్ అధికారి ఐశ్వర్య సింగ్ పాల్గొని సర్పంచ్ సాయికిరణ్ వెల్లడించిన అభిప్రాయాలను ప్రశంసించారు. సర్పంచ్, పారిశుధ్య కార్మికులు, గ్రామ ప్రజలు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలనే ఆయన ఆలోచనను అభినందిస్తూ, “అదే ఈ కార్యక్రమం అందం.. అదే ఈ కార్యక్రమం బలం” అని వ్యాఖ్యానించారు. ఒక గ్రామ సర్పంచ్ ప్రతిపాదించిన ఆలోచన జాతీయ స్థాయి వేదికపై ప్రస్తావనకు వచ్చి ఉన్నతాధికారి ప్రశంసలు అందుకోవడం నేరడిగుంట గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా సర్పంచ్ వొగ్గు సాయికిరణ్ యాదవ్ మాట్లాడుతూ ఈ గుర్తింపు తనకు మాత్రమే కాకుండా గ్రామ ప్రజలకు, పారిశుధ్య కార్మికులకు, గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ చెందుతుందని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో నేరడిగుంట గ్రామాన్ని మరింత పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్ది ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో గ్రామానికి గుర్తింపు రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అంబేద్కర్ విగ్రహం తొలగించిన అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

మున్సిపల్ కార్యాలయం ఎదుట కేవీపీఎస్ ధర్నా



మెదక్, అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

మెదక్ జిల్లా కేంద్రంలో తొలగించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం. అడివయ్య మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భాగంగా 2021లో తొలగించిన పలు విగ్రహాలను తిరిగి ప్రతిష్ఠించిన అధికారులు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని మాత్రం ఇప్పటివరకు ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. గతంలో విగ్రహాల పునఃప్రతిష్ఠకు హామీ ఇచ్చిన నాయకులు తమ మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ విగ్రహాన్ని వెంటనే తిరిగి ఏర్పాటు చేయడంతో పాటు, విగ్రహం తొలగింపునకు బాధ్యులైన అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరారు.

## రామకృష్ణాపురం జడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు.. వేడుకలను ప్రారంభించిన సర్పంచ్ గాదె నాగలక్ష్మి



**చింతకాని, అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను ఖమ్మం జిల్లా చింతకాని మండలం రామకృష్ణాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ముగింపు రోజు సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి. గ్రామ సర్పంచ్ గాదె నాగలక్ష్మి బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి దేవి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు విద్యార్థులకు బతుకమ్మ పండుగ విశిష్టతను వివరించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. సంప్రదాయ పండుగల పట్ల విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని సంబరాలను మరింత సందడిగా మార్చారు.

## ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు

**వట్‌పల్లి, అక్టోబర్ 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండల పరిధిలోని మరవెల్లి ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు వివిధ రకాల రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను తయారు చేసి, పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో ఉత్సాహంగా బతుకమ్మ ఆడుతూ పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు.





ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతోపాటు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నారని ఈ వేడుకలు చాటిచెప్పాయి. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ విద్యతోపాటు సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలను పెంపొందించడంతో పాటు మన సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంచుతాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధతో పాటు ఉపాధ్యాయులు రిత్విన్ రెడ్డి, సంగయ్య, రవీందర్ పాల్గొన్నారు.

## జహీరాబాద్‌లో నూతన జీ.వీ. మాల్ ప్రారంభోత్సవం

**జహీరాబాద్, అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని మెయిన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జీ.వీ. మాల్ (+ఎ హీూూూ) ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ డాక్టర్ ఏ. చంద్రశేఖర్ పాల్గొని మాల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ పట్టణం వ్యాపార, వాణిజ్య రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మహిళలు, పురుషులు, పిల్లల కోసం వివిధ రకాల వస్త్రాలు, ఆధునిక ఫ్యాషన్ దుస్తులతో అందుబాటులోకి వచ్చిన జీ.వీ. మాల్ పట్టణ ప్రజలకు మెరుగైన షాపింగ్ సౌకర్యాన్ని అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానికంగా వ్యాపార సంస్థలు అభివృద్ధి చెందడం వల్ల పట్టణంలో వాణిజ్య కార్యకలాపాలు మరింత విస్తరించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ యూనుస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్షద్ అలీ, మాజీ వైస్ చైర్మన్ ఖాజా, కౌన్సిలర్లు జమీలోద్దీన్, మహేష్ కుమార్, మాజీ ఎంపీటీసీ అశోక్ కుమార్, కాంగ్రెస్ నాయకుడు గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి





**- ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలి: మండల ప్రత్యేక అధికారి పి. కిషన్**

**అందోల్, అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి ):** సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు చేరవేయాలని మండల ప్రత్యేక అధికారి పి. కిషన్ అధికారులకు సూచించారు. ఆయన ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, వివిధ శాఖల ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను సమర్పించగా, గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులకు సంబంధించిన సర్పంచుల సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ మండలంలోని రైతులందరూ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాల గురించి వివరించారు. వీబీజీ రామ్ జీ పథకంలో భాగంగా జలసిరి కార్యక్రమం ద్వారా అన్ని గ్రామ పంచాయతీల్లో ఇంటింటికీ ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలు, డ్రెయిన్ ఎండ్ సోక్‌పిట్‌లను ఏర్పాటు చేసి నీటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా కోడెకల్ గ్రామ సర్పంచ్ మిషన్ భగీరథ ద్వారా గ్రామ ప్రజలకు సరిపడా తాగునీరు సరఫరా చేయాలని కోరారు. చింతకుంట, పోతిరెడ్డిపల్లి గ్రామాల సర్పంచులు మహిళా సమాఖ్య భవనాలకు సంబంధించిన భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం మండల ప్రత్యేక అధికారి పి. కిషన్ మాట్లాడుతూ గ్రామాల్లో ఫామ్ పాండ్స్, ఇంకుడు గుంతలు, అంగన్‌వాడీ మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రాధాన్యతా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లతో పాటు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు.

# మానసిక దివ్యాంగులకు ప్రేమాభిమానాలు పంచాలి.. వైకల్యం శరీరానికే.. విజయ సాధనకు కాదు!

**- భవిత కేంద్రంలో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం**



**నర్సాపూర్, అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని మానసిక వైకల్యం కలిగిన చిన్నారులు, వ్యక్తుల పట్ల ప్రతి ఒక్కరూ ప్రేమాభిమానాలు చూపిస్తూ, అవసరమైన సహాయ సహకారాలు అందించాలని వైద్యులు డాక్టర్ రఘువరన్, డాక్టర్ ప్రియాంక, నర్సాపూర్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, న్యాయవాది ఏ. ఆనంద్ కుమార్ పిలుపునిచ్చారు. వైకల్యం ఉన్నవారిని చిన్నచూపు చూడకుండా సమాజంలోని ఇతరులతో సమానంగా గౌరవించాలని, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ప్రోత్సహించాలని సూచించారు. శారీరక, మానసిక పరిమితులు విజయ సాధనకు అడ్డంకులు కావని, సరైన ప్రోత్సాహం, సహకారం లభిస్తే వారు కూడా అనేక విజయాలు సాధించగలరని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ, మెదక్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు, నర్సాపూర్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో కమిటీ చైర్మన్, న్యాయమూర్తి ఎం. హేమలత సూచనలతో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సాపూర్‌లోని భవిత కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ రఘువరన్, డాక్టర్ ప్రియాంక, రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రతినిధులు, నర్సాపూర్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, న్యాయవాది ఏ. ఆనంద్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు -మాట్లాడుతూ మానసిక వైకల్యం కలిగిన చిన్నారులు, వ్యక్తుల పట్ల వివక్ష చూపకుండా వారికి అండగా నిలవాలని కోరారు. వారి వైకల్యాన్ని ఎత్తిచూపుతూ కించపరచడం కాకుండా, వారిలోని సామర్థ్యాలను గుర్తించి ప్రోత్సహించాలని తెలిపారు. దివ్యాంగుల హక్కులను గౌరవిస్తూ, వారిపట్ల అనుచితంగా ప్రవర్తించకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, వారికి సమాన అవకాశాలు కల్పించి సమాజంలో గౌరవప్రదమైన జీవనం సాగించేలా సహకరించాలని పిలుపునిచ్చారు.

# వైసీపీకి ఈసారి ఆ 11 సీట్లు కూడా రావు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిదే ఘనవిజయం: మంత్రి నాదెండ్ల మనోహర్

**ఏలూరు, అక్టోబర్ 10 (సందేశం టైమ్స్):** రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుంటే, జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇష్టానుసారంగా విమర్శలు చేస్తున్నారని, ఇదే పంథా కొనసాగిస్తే వచ్చే ఎన్నికల్లో గతంలో వచ్చిన 11 సీట్లు కూడా ప్రజలు ఇవ్వబోరని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం ఏలూరు జిల్లా సమీక్షా సమావేశం అనంతరం ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ సహకారం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వం, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వ్యవసాయం, ఐటీ, గ్రీన్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. గూగుల్ డేటా సెంటర్, క్వాంటం వ్యాలీ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో రాష్ట్రానికి పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గత 2019--2024 వైసీపీ పాలనలో రాయలసీమకు వచ్చిన పరిశ్రమలపై దాడులు, బెదిరింపులకు పాల్పడి వాటిని పొరుగు రాష్ట్రాలకు తరలిపోయే పరిస్థితులు కల్పించారని విమర్శించారు. కియా మోటార్స్ అనుబంధ విభాగాలు, అమరరాజా, అనంతపురంలోని జాకీ, ఏషియా పల్ప్ పేపర్, రేణిగుంటలో రిలయన్స్ వంటి పరిశ్రమల విషయంలో వైసీపీ పాలనలో జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ, పరిశ్రమలను ప్రోత్సహించలేని వారు ఇప్పుడు ఉపాధి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.




రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈవీఎంలు అయినా, బ్యాలెట్ పేపర్లు అయినా కూటమి అభ్యర్థులదే తిరుగులేని విజయమని ధీమా వ్యక్తం చేశారు. ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, గత ఎన్నికల్లో వైసీపీకి 11 సీట్లు ఇచ్చినందుకు చింతిస్తున్న ప్రజలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పడం ఖాయమని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.

# విచ్ఛిన్నమైన బహుజన సమాజాన్ని ఏకం చేసి రాజ్యాధికార దిశగా నడిపించిన మహానేత కాన్షీరాం

- కాన్షీరాం వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన సామ్రాట్ గోవర్ధన్

అందోల్, అక్టోబర్, 10 సందేశం టైమ్స్ ప్రతినిధి

భారతదేశంలో కులాలవారీగా విచ్ఛిన్నమైన బహుజన సమాజాన్ని ఏకం చేసి, రాజ్యాధికారం సాధించే దిశగా ప్రజలను చైతన్యపరిచిన గొప్ప సామాజిక ఉద్యమకారుడు మాన్యశ్రీ కాన్షీరాం అని బహుజన సాహిత్య అకాడమీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామ్రాట్ గోవర్ధన్ అన్నారు. అక్టోబర్ 9న కాన్షీరాం వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పిస్తూ, దేశంలోని అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం కాన్షీరాం చేసిన కృషిని స్మరించుకున్నారు. 1934 మార్చి 15న పంజాబ్‌లో జన్మించిన కాన్షీరాం, తొలుత ఉద్యోగిగా పనిచేసినప్పటికీ సమాజంలో నెలకొన్న కుల వివక్ష, అసమానతలను రూపుమాపాలనే సంకల్పంతో సామాజిక ఉద్యమంలోకి అడుగుపెట్టారని తెలిపారు. 1971లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ ఉద్యోగులను సంఘటితం చేసే లక్ష్యంతో ఉద్యమాన్ని ప్రారంభించి, అనంతరం 1984 ఏప్రిల్ 14న బహుజన్ సమాజ్ పార్టీని స్థాపించి బహుజన రాజకీయ చైతన్యానికి బలమైన పునాది వేశారని పేర్కొన్నారు. దేశ జనాభాలో అధిక సంఖ్యలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఇతర అణగారిన వర్గాలు ఐక్యంగా ఉంటే రాజ్యాధికారాన్ని సాధించగలవనే సందేశాన్ని ఆయన ప్రజల్లోకి తీసుకెళ్లారని తెలిపారు. సైకిల్‌పై ప్రచారాన్ని ప్రారంభించి దేశవ్యాప్తంగా పర్యటిస్తూ బహుజనులను ఏకం చేసేందుకు నిరంతరం శ్రమించారని, ఆయన రాజకీయ ప్రస్థానం ఉత్తరప్రదేశ్‌లో బహుజన్ సమాజ్ పార్టీ అధికారంలోకి రావడానికి మార్గం సుగమం చేసిందని వివరించారు. వ్యక్తిగత జీవితాన్ని పక్కనపెట్టి జీవితాంతం బహుజనుల హక్కులు, సామాజిక సమానత్వం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం పోరాడిన మహానేత కాన్షీరాం అని కొనియాడారు. 2006 అక్టోబర్ 9న ఆయన తుదిశ్వాస విడిచినప్పటికీ, బహుజన సమాజాన్ని చైతన్యపరిచేందుకు చేసిన కృషి నేటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని సామ్రాట్ గోవర్ధన్ పేర్కొన్నారు. కాన్షీరాం ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడటం, సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు.



# మార్వెల్లి నేలపై వికసించిన క్రీడా కుసుమాలు.. రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధమవుతున్న నిఖిత, మానస





వట్పల్లి మండల్ , అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి)

సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల్ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, వారిని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మార్వెల్లి శ్రీకృష్ణ స్పోర్ట్స్ క్లబ్ ముందుకు సాగుతోంది. మార్వెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు నిఖిత, మానస తెలంగాణ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకునేందుకు క్రీడా సాధనలో ముందుకు సాగుతున్నారు. వీరి లక్ష్యాలను సాకారం చేసేందుకు శ్రీకృష్ణ స్పోర్ట్స్ క్లబ్ కమిటీ సభ్యులు అవసరమైన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం అందిస్తూ కృషి చేస్తున్నారు. క్రీడాకారుల విజయాల వెనుక కఠోర సాధన, పట్టుదల, నిరంతర శ్రమతో పాటు తగిన ప్రోత్సాహం ఎంతో అవసరమని క్లబ్ సభ్యులు పేర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు సరైన వేదిక, శిక్షణ, ప్రోత్సాహం లభిస్తే వారు కూడా రాష్ట్ర, జాతీయ స్థాయిలో అద్భుత విజయాలు సాధించగలరని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి, వారి కలలకు రెక్కలు తొడిగి ఉన్నత శిఖరాలకు చేర్చడమే క్లబ్ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో మరింత మంది యువ క్రీడాకారులను తీర్చిదిద్ది, మార్వెల్లి గ్రామానికి క్రీడారంగంలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కలలు కనండి.. కష్టపడండి.. విజయాన్ని సాధించండి! అనే స్ఫూర్తితో శ్రీకృష్ణ స్పోర్ట్స్ క్లబ్ గ్రామీణ క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తూ ముందుకు సాగుతోంది.

# బోరంచ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు.. విద్యార్థులను ప్రోత్సహించిన నేషనల్ హ్యూమన్ రైట్స్ సంస్థ





మానూర్, అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మానూర్ మండలం బోరంచ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను తయారు చేసి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివకుమార్ స్వామి మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచులకు ఎంతో ఇష్టమైన బతుకమ్మ పండుగను పాఠశాలలో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. మహిళల పట్ల గౌరవాన్ని పెంపొందించడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేసే గొప్ప పండుగ బతుకమ్మ అని తెలిపారు. పూర్వకాలం నుంచి తంగేడు తదితర పూలు, ఆకులతో బతుకమ్మను అందంగా అలంకరించి, మధ్యలో పసుపుతో గౌరమ్మను తయారు చేసి పూజించడం తెలంగాణ సంప్రదాయమని వివరించారు. బతుకమ్మ పాటలు పాడుతూ కుటుంబ సభ్యులు, సమాజం సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించడం ఈ పండుగ ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు బైండ్ల కృష్ణ పాల్గొని, అందంగా బతుకమ్మలను తయారు చేసి తీసుకొచ్చిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. విద్యార్థుల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పోషకులు, శ్రేయోభిలాషులకు బతుకమ్మ, విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వట్‌పల్లి రైతు వేదికలో మండల స్థాయి సమన్వయ సమావేశం

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆత్మ కమిటీ ఛైర్మన్ కచుర్ రావు



వట్‌పల్లి, అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి

అందోల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ సిహెచ్ బస్వరాజు ): సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలంలోని రైతు వేదికలో మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆత్మ కమిటీ ఛైర్మన్ కచుర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ బిల్లుల చెల్లింపు, ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత మంజూరు, మొక్కల పెంపకం, ఐసీడీఎస్, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, ఎల్‌నినో ప్రభావం, నీటి ఎద్దడి నివారణ, నీటి సంరక్షణ వంటి అంశాలపై సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని, అనవసర విద్యుత్ కోతలు విధించకూడదని, అవసరమైన చోట కొత్త విద్యుత్ స్తంభాలు మంజూరు చేయాలని, విద్యుత్ కేబుళ్లు కిందకు వేలాడకుండా తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. అలాగే వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందించే సేవలు, ప్రభుత్వ పథకాల అమలు, జలశ్రీ కార్యక్రమం తదితర అంశాలపై చర్చించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, గ్రామాల సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జెడ్పీహెచ్ఎస్ బ్రహ్మణపల్లిలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పిన విద్యార్థులు

నర్సాపూర్, అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని బ్రహ్మణపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్)లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు వివిధ రకాల రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి, బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. సంప్రదాయ పద్ధతిలో బతుకమ్మ ఆడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పారు. విద్యార్థుల సందడి, బతుకమ్మ పాటలతో పాఠశాల ఆవరణ కళకళలాడింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, పూల వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు విద్యార్థుల్లో ఐక్యతాభావం, సాంస్కృతిక విలువలు, ప్రకృతి పట్ల ప్రేమను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు తెలంగాణ



పండుగల విశిష్టతను తెలియజేస్తూ, మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందించడం అభినందనీయమని పలువురు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భవాని, మంజుల, అఫ్రిన్ ఫాతిమా, మల్లయ్య, శ్రీనివాస్, శేఖర్, మరో శ్రీనివాస్, శివశంకర్,

# రోడ్డు ప్రమాదాల నివారణకు పిచ్చి మొక్కల తొలగింపు సర్పంచ్ కలాలి సురేఖ సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో





**వట్‌పల్లి, అక్టోబర్ 9 (సందేశం టైమ్స్ ప్రతినిధి**

అందోల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ సిహెచ్ బస్వరాజ్):సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం దరఖాస్తుపల్లి గ్రామంలో రోడ్డు ప్రమాదాలను నివారించి, వాహనదారులకు సురక్షిత ప్రయాణం కల్పించాలనే ఉద్దేశంతో గ్రామ సర్పంచ్ కొడాలి సురేఖ సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరగడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రోడ్డు భద్రతకు ప్రాధాన్యతనిస్తూ గ్రామ పరిధిలో రహదారులను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, ప్రజలు మరియు వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాలాలి సురేఖ సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో అన్ని రంగాల్లోనూ దరఖాస్తుపల్లి గ్రామాన్ని ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, గ్రామ అభివృద్ధితో పాటు రోడ్డు భద్రత, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞాన సమాజ నిర్మాణానికి స్వేరోస్ నెట్‌వర్క్ కృషి చేయాలి



**సూర్యాపేట, అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి,**

సోమయ్య కంభంపాటి): స్వేరోస్ నెట్‌వర్క్ సూర్యాపేట జిల్లా నూతన కమిటీని జిల్లా ఇన్‌చార్జ్ ఏర్పుల ప్రసాద్ కృష్ణ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పుల ప్రసాద్ కృష్ణ మాట్లాడుతూ అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం, ఆత్మగౌరవం అనే నాలుగు ప్రధాన లక్ష్యాలతో జ్ఞాన సమాజ నిర్మాణమే స్వేరోస్ నెట్‌వర్క్ ముఖ్య ధ్యేయమని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ ప్రతిరోజూ వ్యాయామం చేయాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. చేసే ప్రతి పనిని బాధ్యతతో నిర్వహిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, స్వేరోస్ నెట్‌వర్క్ వ్యవస్థాపకులు డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ చూపిన బాటలో పయనిస్తూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, సావిత్రిబాయి పూలే, కాన్షీరాం ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా స్వేరోస్ నెట్‌వర్క్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా పిడమర్తి దశరథ స్వేరోను, స్వేరో ప్రేరణ జిల్లా ఇన్‌చార్జ్‌గా పెద్దపంగు ఉపేందర్ స్వేరోను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం, ఆత్మగౌరవం అనే లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తూ జ్ఞాన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సీనియర్ నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ సీనియర్ నాయకులు సరిత, సునీత, నాగమణి, రేణుక, సోమయ్య, సాయి కృష్ణ, కొండ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సంగమేశ్వరకుంటలో విషాదం.. నీటిలో మునిగి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి







**మానూర్, అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మానూర్ గ్రామ శివారులో ఉన్న సంగమేశ్వరకుంటలో బట్టలు ఉతికేందుకు వెళ్లిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు నీటిలో మునిగి మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం, శుక్రవారం ఉదయం సుమారు 8.30 గంటల సమయంలో దసరా పండుగ నేపథ్యంలో ఇంట్లోని బట్టలు ఉతికేందుకు మానూర్ గ్రామానికి చెందిన మాటూరి నరసింహారెడ్డి, ఆయన భార్య కృష్ణవేణి, తమ్ముడు సంగారెడ్డి, చిన్న కుమారుడు హర్షవర్ధన్ రెడ్డి కలిసి సంగమేశ్వరకుంట వద్దకు వెళ్లారు. అక్కడ బట్టలు ఉతుకుతుండగా ఉదయం సుమారు 11.30 గంటల సమయంలో సంగారెడ్డి ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడిపోయాడు. అతడిని కాపాడేందుకు ప్రయత్నించిన హర్షవర్ధన్ రెడ్డి కూడా నీటిలో పడిపోయాడు. దీంతో వారిని రక్షించేందుకు నరసింహారెడ్డి, ఆయన భార్య కృష్ణవేణి నీటిలోకి దిగగా, వారిద్దరూ కూడా మునిగిపోయారు. ఈ క్రమంలో నీటి అంచున ఉన్న చెట్టు కొమ్మలను పట్టుకున్న హర్షవర్ధన్ రెడ్డి ఒడ్డుకు చేరుకుని గ్రామానికి వెళ్లి జరిగిన విషయాన్ని గ్రామస్తులకు తెలియజేశాడు. వెంటనే గ్రామస్తులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నీటిలో గాలింపు చర్యలు చేపట్టగా, నీటిలో మునిగిపోయిన ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈ ఘటనపై మృతుడు నరసింహారెడ్డి పెద్ద కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పండుగ వేళ ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ఆర్టీసీ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ-ఎస్‌డబ్ల్యూఎఫ్ కూటమి విజయం సాధిస్తుంది: వీఎస్ రావు

**కోదాడ, అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి,**

సోమయ్య కంభంపాటి): సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం ఆర్టీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు ఓటర్లకు ఎన్నికల గుర్తును చూపిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆర్టీసీ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ--ఎస్‌డబ్ల్యూఎఫ్ కూటమి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ కూటమి నిరంతరం కార్మికుల పక్షాన నిలుస్తూ, వారి హక్కుల సాధన కోసం కార్మిక ఉద్యమాలు నిర్వహిస్తోందని తెలిపారు. కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణే తమ కూటమి ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, ఎన్నికల్లో కూటమికి మద్దతు తెలిపి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కోటగిరి వెంకట్ నారాయణ, డిపో అధ్యక్ష కార్యదర్శులు శ్రీదేవి, సోమన్న, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఎం. ముత్యాలు, జ్యోతి,



నాగమణి, రామంజమ్మ, సుధారాణి, అంజలి, ఉపేందర్, ఏఎస్ రావు, సామేలు, రవి, పరుశరాం తదితరులు పాల్గొన్నారు.

2

# వైభవోపేతంగా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ భూమిపూజ నిర్వహించాలి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**- తిరుమల తరహాలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి.. అక్టోబర్ 12న త్రిదండి చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా భూమిపూజ**

**ఖమ్మం, అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి శెట్టి సురేష్):**

ఖమ్మం నగర పరిధిలోని అల్లిపురంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణ భూమిపూజ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈ నెల 12వ తేదీన త్రిదండి చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో కలిసి భూమిపూజ ప్రాంగణాన్ని, ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. తిరుమలలో అనుసరించే విధానాలను ఆదర్శంగా తీసుకుని భక్తుల రాకపోకలకు అనుగుణంగా క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని, రద్దీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. భక్తులకు నాణ్యమైన అన్నప్రసాదం, పులిహోర, తాగునీరు, మజ్జిగ సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని, భోజన కేంద్రాలు, ప్రసాద పంపిణీ కౌంటర్లను పెంచి క్రమబద్ధమైన క్యూలైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తులు వివిధ మార్గాల నుంచి వచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని పార్కింగ్ స్థలాలను గుర్తించి, వాహనాల రాకపోకలకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పార్కింగ్ ప్రాంతాలు, ఆలయ ప్రాంగణానికి చేరుకునే మార్గాల వివరాలను మ్యాప్‌తో సహా సిద్ధం చేసి పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు, పాత్రికేయులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, తొక్కిసలాటలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్య సిబ్బంది, అత్యవసర వైద్య సదుపాయాలు, అగ్నిమాపక వాహనాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయంగా జనరేటర్లను ఏర్పాటు చేయాలని, ప్రాంగణంలో నిరంతర పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి వచ్చే పాత్రికేయులకు కూడా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఖమ్మం నగర పరిధిలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయ నిర్మాణం చేపట్టడం ఈ ప్రాంత ప్రజలకు గొప్ప అవకాశమని మంత్రి పేర్కొన్నారు. ఆలయ నిర్మాణం, నిర్వహణ బాధ్యతలు పూర్తిగా టీటీడీ ఆధ్వర్యంలోనే కొనసాగుతాయని స్పష్టం చేశారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొని దేవదేవుని ఆశీస్సులు పొందాలని, కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో,



క్రమశిక్షణతో విజయవంతం చేసేందుకు సహకరించాలని కోరారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణం జరగడం సంతోషకరమని, భూమిపూజకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖల సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేపడతామని తెలిపారు. కార్యక్రమం విజయవంతానికి జిల్లా యంత్రాంగం టీటీడీకి పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, భక్తుల రాకపోకల నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన సిబ్బంది, యంత్రాంగాన్ని సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, టీటీడీ ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ ప్రకృతిని పూజించే పూల జాతర.. ఔషధ గుణాల ఆరోగ్య సంపద!

- తెలంగాణ సంస్కృతికి నిలువుటద్దం, ప్రకృతిని దైవంగా భావించే ఏకైక పూల పండుగ 'బతుకమ్మ





వ్యాసకర్త: మడుపు నవీన్ కుమార్ రెడ్డి

**అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి,**
భాద్రపద అమావాస్య నుంచి ఆశ్వయుజ అష్టమి వరకు తొమ్మిది రోజుల పాటు సాగే ఈ ఉత్సవం కేవలం రంగుల హరివిల్లే కాదు, మానవ ఆరోగ్యానికి మేలు చేసే ఒక గొప్ప ఔషధ గని

**పండుగ ప్రాశస్త్యం**
బతుకమ్మ అంటే "తల్లీ జీవించు" అని అర్థం శరదృతువు ఆరంభంలో, వర్షాల తర్వాత చెరువులన్నీ జలకళను సంతరించుకునే వేళ ఈ పండుగ వస్తుంది. మహిళలంతా ఏకమై, తీరొక్క అడవి పూలను సేకరించి, గోపురం ఆకారంలో బతుకమ్మను పేరుస్తారు. పసుపుతో చేసిన గౌరమ్మను అగ్రభాగాన ఉంచి, ప్రకృతిని పూజిస్తూ, చప్పట్లు కొడుతూ వలయంగా తిరుగుతూ పాడే పాటలు సోదరభావాన్ని, జీవన తత్వాన్ని చాటుతాయి
తొమ్మిది రోజుల పాటు (ఎంగిలిపూల బతుకమ్మ నుండి సద్దుల బతుకమ్మ వరకు) నిత్యం ఒక ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పిస్తారు. చివరగా ఈ బతుకమ్మలను స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేస్తారు. ఈ నిమజ్జనం వెనుక అద్భుతమైన శాస్త్రీయ రహస్యం దాగి ఉంది. బతుకమ్మలో వాడే పూలన్నీ ఔషధ గుణాలు కలిగినవి కావడం వల్ల, అవి నీటిలో నాని జలాలను శుద్ధి చేస్తాయి.
బతుకమ్మ పూలు - శాస్త్రీయ నామాలు ఔషధ గుణాలు
బతుకమ్మ అలంకరణలో వాడే ప్రతి పువ్వు వెనుక ఒక ప్రత్యేక వైజ్ఞానిక, వైద్య ప్రాముఖ్యత ఉంది:

**1.తంగేడు పువ్వు :-**
దీని శాస్త్రీయ నామం సెన్నా ఆరిక్యులేటా తెలంగాణ రాష్ట్ర పుష్పమైన ఇది మధుమేహాన్ని అదుపు చేయడంలో అద్భుతంగా పనిచేస్తుంది. చర్మ వ్యాధులను తగ్గిస్తుంది.

**2.గునుగు పువ్వు :-**
దీని శాస్త్రీయ నామం సిలోసియా అర్జెంటియా దీనికి యాంటీ బాక్టీరియల్ గుణాలు ఎక్కువ. గాయాలను త్వరగా నయం చేయడానికి, కంటి సమస్యల నివారణకు తోడ్పడుతుంది.

**3.పట్టుకుచ్చు పువ్వు:**
దీని శాస్త్రీయ నామం సిలోసియా క్రిస్టాటా గునుగు జాతికే చెందిన ఈ పువ్వు చూడటానికి కోడిజుట్టు ఆకారంలో, పట్టులా మెరుస్తూ ఉంటుంది. ఇది అతిసారం , రక్తహీనత వంటి సమస్యల నివారణకు ఆయుర్వేదంలో వాడబడుతుంది. చర్మ మంటలను తగ్గిస్తుంది.

**4.గోరింట పువ్వు:-**
దీని శాస్త్రీయ నామం లాసోనియా ఇనెర్మిస్ ఈ పూలు మరియు ఆకులు శరీరానికి చలువ చేస్తాయి. వీటిలో యాంటీ-ఫంగల్ గుణాలు సమృద్ధిగా ఉండటం వల్ల చర్మ ఇన్ఫెక్షన్లను, గోళ్ల వ్యాధులను దూరం చేస్తాయి. ఒత్తిడిని తగ్గించి నిద్రలేమిని నివారిస్తాయి.

**5.మందార పువ్వు:-**
దీని శాస్త్రీయ నామం హైబిస్కస్ రోసా-సినెన్సిస్ ఇది జుట్టు ఆరోగ్యానికి మరియు పెరుగుదలకు సంజీవని లాంటిది. గుండె జబ్బుల నివారణకు, అధిక రక్తపోటును నియంత్రించడానికి దీని రేకుల కషాయం అమితంగా పనిచేస్తుంది.

**6.కట్ల పువ్వు:-**
దీని శాస్త్రీయ నామం ఇపోమియా కార్నియా బతుకమ్మ చుట్టూ రంగుల హరివిల్లులా పేర్చడానికి ఈ పువ్వును వాడతారు. దీనికి గాయాలను తగ్గించే గుణం ఉంది. చర్మంపై వచ్చే దురదలు, తామర వంటి సమస్యలకు దీని ఆకులు పూల రసం దివ్యౌషధంగా పనిచేస్తుంది.

**7.బంతి పువ్వు:-**
దీని శాస్త్రీయ నామం టాజెటీస్ ఎరెక్టా ఇందులోని యాంటీ మైక్రోబియల్ గుణాలు చర్మ అలర్జీలను దూరం చేస్తాయి. కీటకాలను వికర్షించే శక్తి దీనికి ఉంది.

**8.చామంతి పువ్వు:-**
దీని శాస్త్రీయ నామం క్రిసాంథిమమ్ ఇండికమ్ ఈ పూల రసం/టీ శరీరానికి చలువ చేస్తుంది. జలుబు, తలనొప్పి, నరాల బలహీనతను తగ్గించి ఒత్తిడిని దూరం చేస్తుంది.

**9.గుమ్మడి పువ్వు:-**
దీని శాస్త్రీయ నామం కుకుర్బిటా పెపో ఇందులో విటమిన్-ఎ, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండి, కంటి ఆరోగ్యానికి, రోగనిరోధక శక్తికి మేలు చేస్తాయి.

**10.బీర పువ్వు:-**
దీని శాస్త్రీయ నామం లుఫ్ఫా సిలింద్రికా పసుపు రంగులో ఉండే ఈ పువ్వు రక్తాన్ని శుద్ధి చేయడానికి మరియు కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఉపయోగపడుతుంది.

**11.తామర పువ్వు:-**
దీని శాస్త్రీయ నామం నిలుంబో న్యూసిఫెరా జాతీయ పుష్పం అయిన ఈ పువ్వు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. మానసిక ప్రశాంతతను ఇస్తుంది, ఆయుర్వేదంలో దీని విత్తనాలు, వేర్లను విస్తృతంగా వాడతారు.

**12.గడ్డి పువ్వు:-**
దీని శాస్త్రీయ నామం ట్రైడాక్స్ ప్రోకంబెన్స్ ఇది సహజసిద్ధమైన యాంటీ సెప్టిక్ లా పనిచేస్తుంది. ఏదైనా దెబ్బలు తగిలినప్పుడు దీని రసం రాస్తే రక్తం కారడం ఆగిపోతుంది.
ఈ పూలన్నింటినీ కలిపి చెరువులలో నిమజ్జనం చేయడం వల్ల, వర్షాకాలం చివరలో నీటిలో చేరే హానికరమైన బ్యాక్టీరియా నశించి నీరు శుద్ధమవుతుంది. అందుకే "బతుకమ్మ పండుగ అంటే పర్యావరణ పరిరక్షణతో కూడిన వైజ్ఞానిక వేడుక" అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు
2

# అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు..



**అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి,**
కామారెడ్డి పట్టణంలోని శ్రీ సరస్వతీ విద్యామందిర్ హైస్కూల్‌లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, మాతాజీలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా పాఠశాల ప్రధానాచార్యులు నల్ల నాగభూషణం మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ విశిష్టత, ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ప్రకృతిని, పూలను పూజించే విశిష్ట సంప్రదాయం తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందన్నారు.బతుకమ్మ వేడుకల ద్వారా విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి పట్ల ప్రేమ, పూల ప్రాముఖ్యతను తెలియజేశారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పాఠశాల ఆవరణ బతుకమ్మల రంగురంగుల అందాలతో పూలవనాన్ని తలపించింది.ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ ప్రిన్సిపల్ నాగేష్, ఆచార్య బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ సీనియర్ నాయకులకు ఘన సన్మానం..



**అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి,**
తెలంగాణ ఉద్యమంలో పాల్గొని, 2001 నుంచి బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్న సిరికొండ మండలం రావుట్ల గ్రామానికి చెందిన తోట రాజన్న, కొండాపూర్ గ్రామానికి చెందిన అబ్బాస్ మొహమ్మద్‌లను శుక్రవారం నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, మైలారం గంగారెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ భూషణ్ రెడ్డి, తోట రాజేందర్, గడ్డల సురేందర్, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని నిరంతరం కృషి చేయాలి.





- సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ..రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలి.
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.



**అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి,**
సిరిసిల్ల పట్టణ కేంద్రంలో ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన 100 రోజుల త్రివర్ణ పతాక కార్యక్రమానికి జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రతి విద్యా సంవత్సరంలో 100 రోజుల పాటు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసే కార్యక్రమం అభినందనీయమని,ఇలాటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ భావాన్ని పెంపొందించడంతో పాటు దేశం పట్ల గౌరవం, బాధ్యతను పెంచుతాయని తెలిపారు.
అనంతరం విద్యార్థులని ఉద్దేశించి మాట్లాడుతూ...
విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. చదువుతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని అలవర్చుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ సమాజానికి ఉపయోగపడే బాధ్యతగల పౌరులుగా ఎదగాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని గంజాయి, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించి మాదకద్రవ్యాల నిర్మూలనకు సహకరించాలన్నారు. ప్రతి విద్యార్థి రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని, మైనర్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి ఉల్లంఘనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు, ఇతరులకు కూడా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉంటూ సోషల్ మీడియాని జాగ్రత్తగా వాడాలని,ముఖ్యంగా సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం ఎవరితో కూడా పంచుకోవద్దని సూచించారు.సోషల్ మీడియా ద్వారా నకిలీ అకౌంట్లు, ఫేక్ లింకులు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, స్కాలర్‌షిప్‌లు, గిఫ్ట్ ఆఫర్లు, లక్కీ డ్రా పేర్లతో మోసాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ సాయి కిరణ్, కళశాల ప్రిన్సిపాల్ విజేయ్ రగునందన్ , కళశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.
1

# న్యావనందిలో నాలుగు మినీ ట్యాంకులకు శంకుస్థాపన..



**అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి,**
సిరికొండ మండలం న్యావనంది గ్రామంలో అభివృద్ధి పనుల్లో భాగంగా నాలుగు మినీ ట్యాంకుల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో నీటి వసతులను మెరుగుపరచాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ పనులకు గ్రామ సర్పంచ్ మామిడికింది దీపా నరేందర్, ఉపసర్పంచ్ కర్రోళ్ల గంగాధర్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ అవసరమైన పనులను దశలవారీగా చేపడతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, గ్రామ కార్యదర్శి, కారోబార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డి కాషాయంలో అసంతృప్తి సెగలు..!

-కమలం శ్రేణుల్లో అంతర్మథనం..!
-కార్యకర్తల్లో పెరుగుతున్న అసహనం?
-నాయకత్వం తీరుపై అంతర్గత చర్చ!

అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాషాయ పార్టీలో నెలకొన్న పరిస్థితులు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తున్నాయి. పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తల ఆశలు, ఆకాంక్షలకు తగిన ప్రాధాన్యం లభించడం లేదనే అసంతృప్తి కొందరిలో వ్యక్తమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న శ్రేణులకు నాయకత్వం నుంచి సరైన గుర్తింపు, ప్రోత్సాహం లభించాలనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**కార్యకర్తలే బలం.. మరి వారి మాటకు విలువెంత?**

ఏ రాజకీయ పార్టీ విజయానికైనా కార్యకర్తలే వెన్నెముక. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తల పాత్ర కీలకం. అలాంటి కార్యకర్తల్లో అసంతృప్తి ఏర్పడితే దాని ప్రభావం పార్టీ కార్యక్రమాలపై పడే అవకాశం ఉంటుంది. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, పరస్పర విశ్వాసం, తగిన ప్రాధాన్యం పార్టీ పటిష్ఠతకు అవసరమని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

**అసంతృప్తికి కారణాలేమిటి?**

గురువారం ఎల్లారెడ్డి మండల కేంద్రంలో స్థానిక పైడి ఎల్లారెడ్డి నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో కార్యకర్తలలో అసంత్రుప్తి బహిర్గతం అయినట్టు సమాచారం. అసంతృప్తికి అసలు కారణాలేమిటి? స్థానిక నాయకత్వం వ్యవహారశైలిపైనా, పార్టీ కార్యక్రమాల్లో ప్రాధాన్యం విషయంలోనా, లేక ఇతర అంతర్గత అంశాలపైనా అసంతృప్తి ఉందన్నది స్పష్టత రావాల్సి ఉంది. ఈ అంశాలపై పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే అసంతృప్తికి సంబంధించి నిర్దిష్ట కారణాలు, బాధ్యుల వివరాలపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది.

**జిల్లా నాయకత్వం దృష్టి సారించేనా?**

కార్యకర్తల మనోభావాలను గుర్తించి, వారి సమస్యలను పరిష్కరించే దిశగా జిల్లా నాయకత్వం చర్యలు తీసుకుంటుందా? అసంతృప్తిని తొలగించి శ్రేణులను ఏకతాటిపైకి తీసుకురాగలదా? అన్నది ఆసక్తికరంగా మారింది. అంతర్గత విభేదాలకు తావివ్వకుండా సమన్వయంతో ముందుకు సాగితేనే పార్టీ క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం అయ్యే అవకాశముంటుంది. ఎల్లారెడ్డి కాషాయ పార్టీలో నెలకొన్న ఈ పరిస్థితులు రానున్న రోజుల్లో ఎలాంటి పరిణామాలకు దారితీస్తాయో వేచి చూడాలి.

11..................

# ఎలక్ట్రిక్ బస్సు, బైక్ ఢీ చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి..



అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి, కామారెడ్డి పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వృద్ధుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. కామారెడ్డి పట్టణంలోని ఓరియంటల్ స్కూల్ ముందు ఎలక్ట్రిక్ బస్సు, బైక్ నీ ఢి కొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న రామచంద్రమూర్తి (65) గాయపడినట్లు సమాచారం.ప్రమాదం జరిగిన వెంటనే గాయపడిన రామచంద్రమూర్తిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించినప్పటికీ, చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. మృతుడు సత్తిరాజు కుమారుడు రామచంద్రమూర్తి వ్యవసాయ వృత్తిని కొనసాగిస్తూ, కామారెడ్డి పట్టణంలోని ఓంశాంతి కాలనీలో నివాసం ఉంటున్నాడు.ఈ రోడ్డు ప్రమాద ఘటనతో స్థానికంగా విషాదం నెలకొంది. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కామారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది.

# పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఈఓ మల్లికార్జున్..

-విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేలా తీర్చిదిద్దాలి



అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) మల్లికార్జున్ సూచించారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న తొమ్మిదో తరగతి జవాబు పత్రాల బాహ్య మూల్యాంకన శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా హిందీ సబ్జెక్టుకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియను పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు అందించారు. విద్యార్థుల విద్యా ప్రగతిని ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు.జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థుల ఎస్ఏ-1 మార్కులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.అనంతరం ఉపాధ్యాయుల హాజరు పట్టిక, మధ్యాహ్న భోజన పథకం రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు.ఈ తనిఖీలో మండల విద్యాశాఖ అధికారి రామస్వామి, తాడ్వాయి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి, హిందీ భాషా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

8

# గో ఆధారిత వ్యవసాయంలోనూ రాణిస్తున్న రైతు పెద్ద గంగారెడ్డి..



అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి, సిరికొండ మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామానికి చెందిన తలుకట్ల పెద్ద గంగారెడ్డి రాజకీయాల్లోనే కాకుండా వ్యవసాయంలోనూ తనదైన గుర్తింపు తెచ్చుకుంటున్నారు. బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూనే, స్వయంగా వ్యవసాయ పనులు చేపడుతూ గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్నారు.రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదుగుతున్నప్పటికీ వ్యవసాయాన్ని విస్మరించకుండా పొలంలో స్వయంగా పనిచేస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, గో ఆధారిత వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తే సాగు ఖర్చులు తగ్గించుకునే అవకాశాలు ఉంటాయని వ్యవసాయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.ఇలాంటి రైతులను ప్రభుత్వం గుర్తించి ప్రోత్సహించడంతో పాటు, వారి అనుభవాలను ఇతర రైతులకు శిక్షణ రూపంలో అందిస్తే ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై మరింత అవగాహన పెరిగి, రైతులకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది.

# యువత చెడు వ్యసనాలకు సైబర్ మోసాలకు దూరంగా ఉండాలి..



అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి, దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీదేవి గార్డెన్‌లో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమ పేరుతో మోసాలు, మైనర్ డ్రైవింగ్, మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, సైబర్ నేరాలు, మహిళల భద్రత, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు.యువత సోషల్ మీడియాను జాగ్రత్తగా వినియోగించాలని, తెలియని వ్యక్తులను నమ్మి మోసపోవద్దని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, అధ్యాపకుల సూచనలు పాటిస్తూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని తెలిపారు.పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి బృందం పాటలు, సందేశాత్మక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో చైతన్యం నింపారు. షీ టీమ్ విధులు, మహిళల భద్రత, పోక్సో చట్టంపై డబ్ల్యూపీసీ సౌజన్య వివరించారు.అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112, సైబర్ నేరాల ఫిర్యాదులకు 1930, మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం కోసం 1908, మహిళల భద్రత కోసం షీ టీమ్ నంబర్ 8712686094ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ రెడ్డి, అధ్యాపకులు, షీ టీమ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బధిర విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించిన పోలీస్ కమిషనర్..

-విద్యార్థుల సమస్యలను సానుభూతితో అర్థం చేసుకోవాలి పోలీస్ సిబ్బందికి సూచన



అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి, నిజామాబాద్ నగరంలోని గ్రేసీ ఆర్గనైజేషన్ ఫర్ డెవలప్‌మెంటల్ సర్వీసెస్‌లో శుక్రవారం పోలీస్ కమిషనర్ బధిర విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సమస్యలను సానుభూతితో అర్థం చేసుకొని, వారికి అండగా నిలవాలని పోలీస్ సిబ్బందికి సూచించారు.పోలీస్ స్టేషన్లకు ఫిర్యాదుల కోసం వచ్చే బధిరులతో గౌరవప్రదంగా వ్యవహరించాలని, వారి సమస్యలను అర్థం చేసుకొని అవసరమైన సహకారం అందించాలని కమిషనర్ పేర్కొన్నారు. దివ్యాంగులు పోలీసులను సంప్రదించినప్పుడు వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సహాయం అందించాలని తెలిపారు.అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్స్, దుస్తులను అందజేశారు. విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించి వారితో ఆప్యాయంగా గడిపారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ శుభం ప్రకాష్, ఏసీపీలు ప్రకాష్, గురునాయుడు, పలువురు సీఐలు, ఎస్ఐలు, గ్రేసీ ఆర్గనైజేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదు..

-సిరికొండ మండల బీఆర్ఎస్ నాయకుల హెచ్చరిక



అక్టోబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి, వరి ధాన్యం కొనుగోళ్లలో రైస్ మిల్లుల యాజమాన్యాలు సిండికేట్‌గా ఏర్పడి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలపై సిరికొండ మండల బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు న్యాయమైన మద్దతు ధర అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చి, ప్రస్తుతం 8 నుంచి 9 గంటల విద్యుత్ కూడా సక్రమంగా అందించడం లేదని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని, ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు న్యాయం జరగకపోతే రైతుల పక్షాన ఉద్యమానికి సిద్ధమవుతామని సిరికొండ మండల బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.

3